క్లుప్తంగా

రేకుల షెడ్ కూల్చివేత



షెడ్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: శివరాంపల్లి సులేమాన్‌నగర్ చెరువును కబ్జా చేస్తూ ఏర్పాటు చేసిన భారీ రేకులషెడ్‌ను రాజేంద్రనగర్ రెవెన్యూ సిబ్బంది శుక్రవారం కూల్చివేశారు. సర్వే నెంబర్ 116లోని సులేమాన్‌నగర్ చెరువు ఉంది ఈ చెరువును కబ్జా చేస్తూ కొన్ని రోజుల క్రితం ప్రహరీని ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని స్థానికులు తహసీల్దార్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం సిబ్బందితో పరిశీలించి జేసీబీ సహాయంతో షెడ్‌ను కూల్చివేశారు. మరోసారి చెరువును కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇష్టంగా చదివితే ఉన్నతస్థాయికి చేరవచ్చు



మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ యాదగిరి

గోల్కొండ: ఇష్టంగా చదివితే రిక్షా నడిపే వారి పిల్లలు సైతం కలెక్టర్ కావొచ్చని ఉన్నత విద్యామండలి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి. యాదగిరి అన్నారు. శుక్రవారం గోల్కొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన డీఆర్‌సీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ మార్గదర్శనంలో డిగ్రీ స్థాయి కోర్సులలో ఎన్నో కొత్త జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు ప్రారంభం అయ్యాయన్నారు. ఈ కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. విద్యార్థులకు ఉపాధి సంబంధం ఉన్న కోర్సుల పట్ల ఆసక్తి ఉన్న విషయం తెలుస్తుందని నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. కళాశాలలో అడ్మిషన్‌లలో ఎటువంటి అవకతవకలు జరగకుండా ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ఎంతగానో ఉపయోగకరంగా ఉందని గోల్కొండ లాంటి ప్రాంతంలోని మహిళా డిగ్రీ కళాశాలలో నిరుపేదలు, వెనుకబడిన ప్రాంత విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి జాయింట్ డైరెక్టర్లు రాజేందర్ సింగ్, హైదరాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో పాటు గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాసరాజు, డాక్టర్ రాజేంద్ర కుమార్, డాక్టర్ బాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ లెక్చరర్ డాక్టర్ మంజూరు హుస్సేన్‌ను సన్మానించారు.

లారీ ఢీకొని మహిళ మృతి

శంషాబాద్ రూరల్: లారీ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన పాల్మాకుల వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇనాంశేరి గ్రామానికి చెందిన పిల్లి కళావతి(52) బెంగళూరు జాతీయ రహదారిపై పాల్మాకుల వద్ద శుక్రవారం రాత్రి రోడ్డు దాటుతుండగా అటుగా వచ్చిన లారీ ఆమెను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



జ్యోతికి చెక్కును అందజేస్తున్న డీవీవీఎస్‌వీ సాయిప్రసాద్ కోటిరెడ్డి

అబిడ్స్: కెనరా బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమానికి, వారి శ్రేయస్సుకు మంజీరా కో ఆపరేటివ్ సొసైటీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని సొసైటీ చైర్మన్ డీవీవీఎస్‌వీ సాయిప్రసాద్, కార్యదర్శి కోటిరెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం, వారి ప్రగతి కోసం సొసైటీ ముందుంటుందన్నారు. కెనరా బ్యాంక్ వివేకానందనగర్ బ్రాంచ్ ఉద్యోగిని ఎ.జ్యోతికి సొసైటీ తరఫున రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా డీవీవీఎస్‌వీ సాయిప్రసాద్, కోటిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల కష్టసుఖాలలో పాలుపంచుకోవడమే మంజీరా సొసైటీ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బీఎస్.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో కేక్ కట్ చేయిస్తున్న మాజీ ఎంపీపీ తలారి మల్లేష్



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న మణికొండ రామకృష్ణారెడ్డి, శ్రీరాములు



ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్

ఘనంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పుట్టినరోజు వేడుకలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉదయం మైలార్‌దేవ్‌పల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలుగుచెరువు మహేష్ ఆధ్వర్యంలో భారీ గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు అక్కెం రఘుయాదవ్ ఆధ్వర్యంలో యువకులు భారీ ర్యాలీ నిర్వహించి గజమాలతో సన్మానించి భారీ కేక్ కట్ చేయించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి, వనం శ్రీరామ్ రెడ్డి, రగడంపల్లి శ్రావణ్, సయ్యద్ అతహుల్లా, రాపోలు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న మణికొండ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి

సీబీఐటీలో 'వాల్ ఆఫ్ డెమోక్రసీ'

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో శుక్రవారం ప్రజాస్వామ్యంపై అభిప్రాయ సేకరణకు ప్రజాస్వామ్య వాల్‌ను ప్రారంభించారు. కళాశాలకు చెందిన అక్షరాస్యత క్లబ్ ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మన ప్రజాస్వామ్యంపై అవగాహన కల్పించుకోవటంతో పాటు దాన్ని మరింత పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలను ఈ వాల్‌పై విద్యార్థులు నిర్భ్యంతరంగా రాయాలన్నారు. ఈసందర్భంగా ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వ విధానాన్ని ప్రజాస్వామ్యం అంటారని అత్యధిక విద్యార్థులు అభిప్రాయాలను తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సమన్వయ కర్త డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



అభిప్రాయాలను రాసిన విద్యార్థులు

వాహనాల తనిఖీ

మియాపూర్ : మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్, జేపీనగర్ ప్రాంతాలలో ప్రధాన రోడ్డు వెంబడి మియాపూర్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. మియాపూర్ డీఐ కాంతారెడ్డి, ఎస్ఐ గిరీష్‌లు సరైన పత్రాలు ఉన్నాయా అని పరిశీలించారు. అదేవిధంగా నంబర్ ప్లేట్లు లేకుండా, కనబడకుండా ఉన్న వాహనాలను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ మధ్య కాలంలో చైన్‌స్నాచింగ్, పార్కింగ్ స్థలాల నుండి వాహనాల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి కాలనీ, రోడ్ల వెంబడి తనిఖీలు నిర్వహించి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న లోధ్ క్షత్రియ యువ సంఘటన్ నాయకులు

అబిడ్స్: సీఎం కేసీఆర్ లోధ్ కులస్తుల ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి స్థలం కేటాయించడంతో పాటు రూ.కోటి అభివృద్ధి పనులకు కేటాయించారని లోధ్‌క్షత్రీయ యువ సంఘటన్ అధ్యక్షుడు బల్‌దీప్ సింగ్, ప్రధాన కార్యదర్శి తుల్జారామ్‌సింగ్ పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా తమ చిరకాల కోరికను బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. రూ.10 కోట్ల విలువైన భూమితో పాటు కోటి రూపాయలను అభివృద్ధికి కేటాయించడంతో లోధ్ క్షత్రియ యువ సంఘటన్ నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బల్‌దీప్ సింగ్, తుల్జా రామ్ సింగ్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వానికి లోధ్ కులస్తులు పూర్తి మద్దతుగా ఉంటామన్నారు. కార్యక్రమంలో లోధ్ క్షత్రియ యువ సంఘటన్ నాయకులు అర్జున్ సింగ్, నర్సింగ్ సింగ్, కమలేష్ సింగ్, సుభాష్ సింగ్, ధర్మేష్ సింగ్, వికాస్ సింగ్, విక్రమ్ సింగ్, నవీన్‌సింగ్, అమన్ సింగ్, శైలేందర్ సింగ్ దుర్గా సింగ్, దుర్గేష్ సింగ్ పాల్గొన్నారు.

బాంబు ఉందంటూ ఐటీ కంపెనీకి బెదిరింపు కాల్

మాదాపూర్: ఐటీ కంపెనీలో బాంబు ఉందని బెదిరింపు కాల్ చేసిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లోని టీసీఎస్ కంపెనీలో బాంబు ఉందని ఓ వ్యక్తి ఫోన్ చేయడంతో మాదాపూర్ పోలీసులు ఐటీ కార్యాలయాన్ని క్షణంగా తనిఖీ చేశారు. మరిన్నీ కంపెనీలలోనూ టీంలతో తనిఖీలు చేసినట్టు తెలిపారు. దాదాపు 1500 మంది ఉద్యోగులు టీసీఎస్‌లో పనిచేస్తున్నారు. తనిఖీలు జరుగుతుండగా అదే వ్యక్తి మళ్లీ ఫోన్ చేసి బెదిరింపు కాల్ అని చెప్పడంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా 6నెలల క్రితం అదే కంపెనీలో పనిచేసి మానేసినట్టు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

గోల్కొండ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే డెంగీ, మలేరియా వ్యాధులను నివారించవచ్చని బల్దియా ఎంటమాలజీ సూపర్‌వైజర్ ఇంతియాజుద్దీన్ అన్నారు. శుక్రవారం గోల్కొండ ఖాజీ గల్లీలోని కమ్యూనిటీహాల్‌లో విషజ్వరాలు, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంట్లో, ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దీనివల్ల దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయని, దోమకాటు వల్ల వ్యాపించే రోగాలను నివారించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ ఏరియా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అలీ, మహ్మద్ జాహెద్ తదితరులున్నారు.

అలకాపూర్‌కు బస్ సర్వీసు



అలకాపూర్ టౌన్‌షిప్‌లో బస్సును ప్రారంభించిన ఆర్టీసీ అధికారులు, స్థానికులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోనే అతిపెద్ద అలకాపూర్ టౌన్‌షిప్‌కు ఆర్టీసీ అధికారులు వజ్ర ఏసీ బస్ సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. టౌన్‌షిప్ నుంచి కూకట్‌పల్లి జేఎన్‌టీయు వరకు ప్రతి రోజు ఆరు ట్రిప్పులు, జేఎన్‌టీయు నుంచి అలకాపూర్ టౌన్‌షిప్‌కు నాలుగు ట్రిప్పులు తిరుగుతుందని మెహిదీపట్నం డిపో మేనేజర్ సూర్యనారాయణ తెలిపారు. అలకాపూర్ టౌన్‌షిప్ నుంచి ఉదయం 8గంటలకు, 9 గంటలకు, 10 గంటలకు, 11 గంటలకు సాయంత్రం 4.20 గంటలకు, 7.20 గంటలకు బస్ ఉంటుందన్నారు. జేఎన్‌టీయూ నుంచి ఉదయం 9గంటలకు, 10గంటలకు సాయంత్రం 5.20 గంటలకు,6.20 గంటలకు బస్‌లు ఉంటాయన్నారు. ప్రయాణికుల సంఖ్య పెరిగితే మరిన్ని బస్సులను నడుపుతామని, బస్సు సర్వీసును ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టౌన్‌షిప్ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

రాయదుర్గం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి సైబరాబాద్ కమిషనరేట్ ద్వారా ఆర్థిక సహాయంను సీపీ స్టీఫెన్ రవీంద్ర అందజేశారు. రూ.11.60 లక్షల చెక్కును మేడ్చల్‌కు చెందిన జి శ్రీనివాస్ కుటుంబసభ్యులకు సీపీ అందించారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, అదనపు డీసీపీ ట్రాఫిక్ శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ నర్సింహారెడ్డి సమక్షంలో చెక్కును అందించారు. కాగా అతని తల్లికి మేడ్చల్ ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ బిఎన్ఎస్‌రెడ్డి నెలకు రూ.2,500 ఒక ఏడాది పాటు అందిస్తానన్నారు. బాధిత కుటుంబానికి రూ.30 లక్షల బీమా అందించారు.



హోంగార్డు కుటుంబానికి చెక్కు అందిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర, పోలీసు అధికారులు

రూట్ మారిన 47వై/ఎం బస్సులు

సాక్షి ఎఫెక్ట్..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం.78లో రోడ్డు ఇరుకుగా ఉండటంతో సిటీ బస్సులు రాకపోకలు సాగిస్తుండటం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ స్తంభించిపోతూ స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఫిలించాంబర్ నుంచి షేక్‌పేట ఓల్డ్ ముంబయి వరకు రూ. 1.15 కోట్లతో అన్ని హంగులతో రోడ్డును విస్తరించినా ఆర్టీసీ బస్సులు వినియోగించుకోవడం లేదని దీని వల్ల రోడ్ నెం 78పై భారం పడుతున్నదని ట్రాఫిక్ ఇక్కట్లు పెరిగిపోతున్నాయని 'సాక్షి' వివరించింది. దీనిపై ఆర్టీసీ అధికారులు స్పందించారు. విస్తరించినా... వినియోగించని శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించారు. కంటోన్మెంట్ డిపో మేనేజర్ ఎల్.రాంమోహన్ ఈ మేరకు రాణిగంజ్ డిపోకు చెందిన 47వై/ఎం రూట్ బస్సులను గురువారం నుంచి రూట్ మారుస్తూ ఆదేశాలు జారీచేశారు. ఈ బస్సులన్నీ జూబ్లీహిల్స్ రోడ్ నెం. 78 నుంచి కాకుండా ఫిలింనగర్ కొత్త చెరువు మీదుగా షేక్‌పేట ఓల్డ్ ముంబయి రోడ్డు మీదుగా మణికొండ, నార్సింగ్, మంచిరేవుల వైపు వెళ్లేలా ఆదేశాలు ఇచ్చారు. ఇక్కడ స్పందన చూసి 47/ఎల్ రూట్ బస్సులను కూడా మారుస్తామని ఆయన వెల్లడించారు. దీని వల్ల జూబ్లీహిల్స్ రోడ్ నెం. 78పై ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా ప్రమాదాల నివారణతో పాటు బస్సులు కూడా అనుకున్న రీతిలో ప్రయాణికులకు అందుబాటులో ముందుకు సాగేలా ప్రణాళికలు రూపొందించామని డీఎం వెల్లడించారు.

యువత ప్రధాన భూమిక పోషించాలి



జెండా ఎగురవేస్తున్న నాయకులు

మియాపూర్ : దోపిడీ సమాజంలో మార్పు రావాలంటే యువత ప్రధాన భూమిక పోషించాలని ఏఐఎఫ్ డీవై రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ కర్రా రాజిరెడ్డి అన్నారు. మియాపూర్‌లోని ముజాఫర్ అహ్మద్ నగర్ లో ఏఐఎఫ్‌డీవై రాష్ట్రస్థాయి రాజకీయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వ్యవస్థలో నేటికి అసమానతలు తొలగలేదన్నారు. భారతదేశంలోని దోపిడి, అవినీతి, కులమత వ్యవస్థలను రూపుమాపాలంటే యువత సమాజ మార్పుకై పోరాడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్, జాతీయ కార్యదర్శి గాదగోని రవి, రమేష్, వనం సుధాకర్, తుకారాం నాయక్, ఎండీ సుల్తానా, కీర్తి, దశరథ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కప్-2023 క్రీడా పోటీలు

బండ్లగూడ: గండిపేట్ మండల పరిధిలో ముఖ్యమంత్రి కప్-2023 మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 15,16,17 తేదీల్లో ప్రభుత్వ ఆదేశానుసారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్, నార్సింగి మున్సిపల్, మణికొండ మున్సిపల్ పరిధిలో ఐదు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల నిర్వహణకు మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు పురుషులు, మహిళలు 15-36సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేరు, క్రీడ పేరు, సెల్ ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు ఇచ్చి నమోదు చేసుకోవాలన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ (9121106503), నార్సింగి శానిటేషన్ ఇంచార్జ్(లచ్చిరామ్-9951790097), మణికొండ- బిల్ కలెక్టర్(వర్మ-9700108001) సంప్రదించాలి. ఏవైనా సందేహాలుంటే పీడీ (ఫిజికల్ డైరెక్టర్) 9985231834లో సంప్రదించాలని కోరారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు.

కాటేదాన్‌లో కార్ల్‌మార్క్స్ జయంతి

రాజేంద్రనగర్: మేడే వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం కాటేదాన్‌లోని అమరవీరుల పోరాటయోధుల ఉత్సవ శిబిరం వద్ద కార్ల్‌మార్క్స్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ హాజరై కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం మీద అత్యధిక ప్రభావం చూపిన వ్యక్తి కార్ల్‌మార్క్స్ అన్నారు. సరుకులు ఉత్పత్తి చలామణి వినియోగ సందర్భంగా అదనపు విలువ ఏర్పడటం శ్రమ దోపిడిని విశ్లేషించి నిరూపించారన్నారు. వారోత్సవాల సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కార్మికులు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన టీమ్‌కు 8వ తేదీన జరిగే సభలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ రాజేంద్రనగర్ మండల కన్వీనర్ రుద్రకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.రామోహ్మన్‌రావు, మండల కన్వీనర్ కమిటి సభ్యులు వెంకటయ్య, క్లస్టర్ కోశాధికారి భాస్కర్, కృష్ణ, సచిన్, రాహుల్, సునీల్, హనుమంతు, అంజన్న, ప్రభు, సంతోష్, రహీం తదితరులు పాల్గొన్నారు.



కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కోడి పందేలు ఆడుతున్న ఎనిమిది మంది అరెస్ట్



ఎస్ఓటీ పోలీసుల దాడుల్లో పట్టుబడ్డ వ్యక్తులు

శంషాబాద్: ఓ ఫాంహౌస్‌లో కోడి పందేలు నిర్వహిస్తున్న వ్యక్తులతో పాటు ఆడుతున్న వారిని శంషాబాద్ జోన్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గగన్‌పహాడ్‌లోని ఆర్కే గార్డెన్ సమీపంలో ఓ ఫాంహౌస్‌లో డబ్బులు పెట్టి కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు శుక్రవారం ఉదయం దాడులు చేశారు. బిందురాజు అనే వ్యక్తితో పాటు మరో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.23 వేల నగదు, నాలుగు స్మార్ట్‌ఫోన్‌లు, మూడు కోడిపుంజులు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన వారిని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలి

మణికొండ: తీసుకున్న అనుమతుల కన్నా అదనంగా నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 10లో ఓ బిల్డర్ జీప్లస్ 4 అంతస్తులకు అనుమతులు తీసుకుని మరో అంతస్తు అదనంగా నిర్మించారు. దాంతో శుక్రవారం అదనపు అంతస్తు స్లాబ్‌లను కట్ చేశారు. అదే టౌన్‌షిప్‌లో రోడ్డు నెంబర్ 2లో సిల్ట్ ప్లస్ 5 అంతస్తులకు అనుమతులు తీసుకుని మరో అంతస్తు నిర్మాణానికి వేసిన సెంట్రింగ్‌ను పూర్తిగా తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాలంలో తీసుకునే విధంగా టీఎస్ బీపాస్‌ను అమలు చేస్తుందని, అందులో తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అందుకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో టీపీఓ రాకేష్, సిబ్బంది పాల్గొన్నారు.



అలకాపూర్ టౌన్‌షిప్‌లో అదనంగా నిర్మించిన భవనం స్లాబ్‌ను కూల్చిన సిబ్బంది

జీహెచ్‌ఎంసీ కార్మికులకు న్యాయం చేయాలి



గచ్చిబౌలి పీఎస్ వద్ద సీఐటీయూ నాయకులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది

గచ్చిబౌలి: జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి పరిధి గచ్చిబౌలిలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. కార్మికులకు న్యాయం చేయకుంటే జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. సీఐటీయూ శేరిలింగంపల్లి కార్యదర్శి కొంగరికృష్ణ, ఏఐటీయూసీ నాయకులు రామకృష్ణ, చందు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది గచ్చిబౌలిలోని ఇన్‌స్పెక్టర్‌ను శుక్రవారం కలిశారు. గత నెల 29న ముగ్గురు జీహెచ్‌ఎంసీ కార్మికులను ఇన్నోవా ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలు, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కారు యజమాని కార్మికులకు చికిత్స చేయిస్తానని ఒప్పుకుని అపోలో ఆస్పత్రిలో రూ.50 వేల రూపాయలు చెల్లించారు. ఈ క్రమంలో ట్రీట్మెంట్ చేయకుండా ఫోన్ ఎత్తకుండా నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్

గచ్చిబౌలి: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. శుక్రవారం గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె కేసు వివరాలను వెల్లడించారు. ధర్మసపల్లి, తాండూరు, వికారాబాద్ జిల్లాకు చెందిన దివాటి ప్రశాంత్ (23) గచ్చిబౌలిలోని ఐడీబీఐ క్యాంపస్‌లో ఆఫీస్‌బాయ్‌గా పని చేస్తున్నాడు. గొల్ల జనార్దన్ యాదవ్(25) గచ్చిబౌలిలోని ఎస్‌బీఐ ట్రెనింగ్ సెంటర్‌లో సూపర్‌వైజర్‌గా పని చేసి మానేశాడు. ఏప్రిల్ 27న రాత్రి 9 గంటల సమయంలో ఆదిభట్ల టీసీఎస్ ఐటీ ఉద్యోగిని ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో బస్సు దిగి డీఎల్ఎఫ్ సమీపంలో తను ఉండే హాస్టల్‌కు నడుచుకుంటూ వెళుతోంది. డీఎల్ఎఫ్ మొదటి గేట్ ఎదురుగా ఉన్న టీసీఎస్ సినర్జీపార్క్ గేట్ వద్ద కాపు కాచిన ప్రశాంత్ ఆమె మెడలోని గొలుసు లాక్కొని సమీపంలో ఉన్న జనార్దన్ యాదవ్ బైక్‌పై పరారయ్యారు. సీసీ పుటేజీలను పరిశీలించిన పోలీసులు నిందితులను, బైక్‌ను గుర్తించారు. గచ్చిబౌలిలో గురువారం వాహనాల తనిఖీలు చేస్తుండగా బైక్‌ను గుర్తించి ఇద్దరిని పట్టుకున్నారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, 8 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఒకరు లోన్ ఈఎంఐ కోసం, మరొకరు ఉద్యోగం లేక తాగుడుకు బానిసలుగా మారి చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడాలని నిర్ణయించుకున్నారని డీసీపీ తెలిపారు. క్రైం సిబ్బందికి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ కమిషనర్ నంద్యాల నర్సింహారెడ్డి, ఏసీపీ రఘునందన్ రావు, సీఐ సురేష్, డీఐ రవీందర్, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

గోషామహల్ బీఆర్ఎస్ అధికార ప్రతినిధిగా జయశంకర్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ అధికార ప్రతినిధిగా ఉద్యమ నాయకుడు ఎ.జయశంకర్ నియమితులయ్యారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆదేశాలు జారీ చేసి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జయశంకర్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేయడానికి కృషి చేస్తానన్నారు. ఉద్యమకారులకు ఇంతమంచి అవకాశం ఇచ్చిన నందకిశోర్ వ్యాస్ బిలాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ విజయానికి కృషి చేస్తానన్నారు.

